# జీరో

విశ్వనాథం కడు సమర్ధుడు. అన్ని విషయాల్లోనూ సమర్థుడే!

ఎం. ఎస్‌సి. పాసయ్యాక కాన్వొకేషన్లో ఒక బండెడు పుస్తకాలతోపాటు రెండు గోల్డుమెడల్సు కూడా యిచ్చి భుజం తట్టింది యూనివర్సిటీ.

అతని బొంబాయి మెడికల్ ఫర్మ్ లో సైంటిస్ట్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు ఇంటర్వ్యూ బోర్డులోని పెద్ద పెద్ద విజ్ఞానవేత్తలూ యితని అమోఘమైన తెలివితేటలకు ఆశ్చర్యపోయి ముక్కు మీద వేలేసుకున్నారు. అంతటితో ఆగక నీకు తగ్గ ఉద్యోగం మా కంపెనీలో లేదు వెళ్ళమన్నారు. తరువాతనే సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగానికి యింటర్వ్యూకి వెళ్ళింది. ఇతన్ని చూడగానే ఆఫీసర్ 'మీదే కులం' అని అడిగాడు పబ్లిగ్గా. ముందు బిత్తరబోయినా సర్దుకుని చెప్పాడు విశ్వనాథం.

ఆ ఉద్యోగమూ రాలేదు.

చివరకు ఎం.ఎస్‌సి. చదివిన వాళ్ళు చేయకూడని ఒక ఉద్యోగంలో అతికష్టంమీద ఆంధ్రదేశంలోనే చేరాడు విశ్వనాథం.

ఏమీ చదువుకోని తన పైవాడు పని తెలియక.. యితనికి తెలియదని సతాయిస్తుంటే నోర్మూసుకు కూర్చోవటం నేర్చుకున్నాడు. మనసులో 'ఈ దేశం చదువుకున్న వాళ్ళకు కాదు మాష్టారూ' అనుకుని..

ఎలక్షన్లు రాబోతున్నాయని సంతోషించాడు. ఓటు అడగటానికి వచ్చినప్పుడు ఆ మంత్రి పుంగవుడ్ని ఓ మంచి ఉద్యోగం అడగవచ్చని ఆశ పడ్డాడు. ఆ మంత్రివర్యుడు విశ్వనాథం ముఖం చూడకుండానే లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచాడు. అంతేకాదు ఓటు వేయబోయిన విశ్వనాథాన్ని పోలింగ్ ఆఫీసర్ చొక్కా పట్టుకుని 'చదువుకున్న వాడివి కదా బుద్ధి లేదు ఎన్నిసార్లు ఓటేస్తావ్!' అని అడిగాడు కూడాను.

అతని దీనారావాల్ని ఎవరూ వినిపించుకోలేదు. కారణం అక్కడ ప్రొద్దున్నే అతనే వచ్చి ఓటు వేసినట్టుగా వుంది మరి...

ఆ మంత్రి పుంగవుడు తను నగెలిచిన రోజు ఆవేశంతో అదోరకమైన తెలుగుతో మాట్లాడుతుంటే.. ముందు వరసలో కూర్చున్న ముప్పయి మందీ మాటలు వినపడకుండా మైకు ముందు చప్పట్లు కొడుతుంటే బాధ పడ్డాడు విశ్వనాథం. కళ్ళు మూసుకున్నాడు.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఎం.ఎస్‌సి లో తను కష్టపడి చదివిన పుస్తకాలన్నీ కళ్ళ ముందు కదలాడాయి. టీ త్రాగి రాత్రంతా మేలుకుని చదివి, నీరసపడిపోయినా ప్రొద్దున్నే ఉత్సాహం పుంజుకుని బాగా వ్రాసిన పరీక్షలు గుర్తుకొచ్చేయి. కాన్వొకేషన్లో వెలిగిపోతూ వున్న స్టేజీ మీద గవర్నర్ దగ్గర్నించి గోల్డ్ మెడల్స్ తీసుకుంటున్నప్పుడు తన కళ్ళల్లో గర్వం, ఆనందం - ఈనాటికీ మనసులో మెదులుతూనే వుంది. కనపడిన ప్రతీవాడూ 'యూనివర్సిటీ

ఫస్ట్'అంటుంటే తన హృదయం ఎంత పొంగిపోయిందో అడగనవసరం లేదు. కానీ ఈనాడు తన విజ్ఞానం దేశానికి అఖ్కర్లేదు. తన తెలివితేటలూ, మేధస్సూ ఎవరికీ అఖ్కర్లేదు. ఆనాటి క్లోరీన్ ప్లస్ హైడ్రోజన్ ఈనాడు తిండి ప్లస్ బట్ట యివ్వలేకపోతు న్నాయి. తను పస్తులు పడుకుంటున్నప్పుడు, తన డిగ్రీ తననే వెక్కిరించింది. అప్పుడు మళ్ళీ అనుకున్నాడు. - ఈ దేశం చదువుకున్న వాళ్ళకీ, విజ్ఞానవేత్తలకీ కాదు మాష్టారూ' అని...

అతని కళ్ళ ముందు ఎవరో కనపడి అడుగుతున్నారు, 'మరెవరికోసమోయ్ మీ దేశం?' అని...

రాజకీయాలకు, రాజకీయ నాయకులకు, వాళ్ళ ఆశలకు, వాళ్ళ యినప్పెట్టెలకు, లంచాలు తినేవాళ్ళకు, కల్తీ చేసేవాళ్ళకు, వేలి ముద్రలు వేసేవాళ్ళకు, నోట్లు ముద్రలు కొట్టేవాళ్ళకు, డబ్బున్న వాళ్ళకు, యిన్‌కమ్ టాక్స్ కట్టటం మరిచిపోయేవాళ్ళకు సిగ్గూ శరంలేని వాళ్ళకు, మానాభిమానాలు వదిలేసినవాళ్ళకు, ఎదురుగా వున్నవాడిని కాకాపడుతూ ప్రక్కనున్నవాడి నెత్తి మీద చేయి వేసి వాణ్ణి ఆర్పేసేవాళ్ళకు....కసిగా అన్నాడు మగత నిద్రలో.

మరి నీలాటి పెద్ద చదువులు చదువుకున్నవాళ్ళకు, విజ్ఞానం, తెలివి తేటలూ వున్నవాళ్ళకు, మానాభిమానాలూ, సిగ్గూ శరం వున్న వాళ్ళకూ, మానవత్వం, హృదయం వున్నవాళ్ళకూ ఈ దేశంలో దొరికేవి ఏమిటి?

దరిద్రం..రోగాలూ - రోగుష్టులూ - అప్పులూ...కష్టాలూ, ఎండమావులు, తెలుగు మీడియంలో కాలేజి చదువులవంటి వర్తమానం, గవర్నమెంటు హాస్పిటల్లో డాక్టరు బాబును బారుకు పంపించి.. అతని బదులు నర్స్ పొడిచే యింజక్షన్ వంటి ఆకలీ, ఆకాశవాణి తెలుగు ప్రోగ్రాం లాంటి బ్రతుకూ, జీవితంలో దెబ్బలూ, ఆత్మహత్యలూ, భూమి గుండ్రంగా వుందని నిరూపించే ఒక పెద్ద - పేద్ద జీరో వంటి భవిష్యత్తు..ఏదో ఆవేశం వచ్చి అదోలా పెద్దగా అరిచాడు నిద్రలోనే...

అతని భార్య ఉలిక్కిపడి లేచింది. అతన్ని లేపి ఓ గ్లాసుడు మంచినీళ్ళిచ్చింది.

ఒక సెలవు రోజు లైబ్రరీలో కెమిస్ట్రీ గ్రంధాలు చదువుతుండగా, అతని బుర్ర చురుగ్గా పనిచేసింది. తన తెలివితేగలకు తనే ఆశ్చర్యపోయాడు. కాగితాలు గబగబా నలుపుచేశాడు.

మర్నాడు ఆఫీసుకి వెళ్ళగానే హడావుడిగా ఆఫీసర్ కి గుడ్‌మార్నింగ్ కొట్టి నిలబడ్డాడు. గుడ్‌మార్నింగ్ రిసీవ్ చేసుకునే అలవాటులేని ఆ సంస్కారవంతుడు అదోరకంగా చూశాడు.

విశ్వనాథం గొంతు సవరించుకున్నాడు. ఆయనకు అర్థమవాలనే ఉద్దేశ్యంతో తన మనసులోని విషయాన్ని సాధ్యమయినంత సులభంగా చెప్పాడు. ఆయనకు నిజంగానే అర్థం కాలేదు. కళ్ళు టపటపా ఆర్పాడు.

"దానివల్ల నాకేం లాభం?" అన్నాడు బట్టతల నిమురుకొని.

'లాభం అనికాదు. నా రిసెర్చి ఫలిస్తే సైన్సుకి ఎంతో సేవచేసిన వాళ్ళవుతాం...'

'ఊ..! సైన్సుకి సేవచేస్తే'.. ఆయనకు ఈసారి కూడా నిజంగా అర్థం కాలేదు. 'నాకేం లాభం' అన్నాడు.

విశ్వనాథానికి ఆవేశం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు. తమాయించుకొని నెమ్మదిగా అన్నాడు - "అమెరికా చంద్రమండలం చేరటానికి కొన్ని కోట్ల డాలర్లు ఖర్చు

పెడుతున్నన్నది. సైన్సు రోజు రోజుకీ పెరిగి మానవజీవితసరళినే ప్రగతి పధాన నడిపిస్తున్నది..అటువంటి....''

ఆయన మధ్యలోనే మళ్ళీ అన్నాడు, "నాకేం లాభం?" అని

విశ్వనాథం ముఖం ఎర్రబడింది. అయినా తమాయించుకున్నాడు. తమాయించుకుని నెమ్మదిగా అన్నాడు. "ఏమీ అక్కర్లేదు..నన్ను రోజూ మధ్యాహ్నం పూట వదిలేయండి ఏ కాలేజీ లాబరేటరీలోనో...''

ఆయన నవ్వాడు. 'ఓ యస్..నీకా మాత్రం సహాయం చేయలేకపోతే నేనెందుకు ఒక్క మధ్యాహ్నమే ఏం ఖర్మ. ప్రొద్దున కూడా మానేయవచ్చు... ఈ ఉద్యోగం మానేసి వెళ్ళి హాయిగా రిసెర్చి చేసుకో...''

విశ్వనాధంలోని అభిమానం కళ్ళెం వదిలిన గుర్రంలా పైకి లేచింది. కానీ అతని సంస్కారం, చదువూ, ముఖ్యంగా కడుపులోని ఆకలి, యింటి దగ్గర కడుపుతో వున్న పెళ్ళాం. మంచమెక్కి న తల్లి దండ్రీ గుర్తుకొచ్చి అతన్నా ప్రయత్నం నుంచి ఆపారు.

మెల్లగా అన్నాడు - 'వద్దు సార్...అవేమీ నాకొద్దు. ఈ ఉద్యోగమే చేసుకుంటాను!" అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

విశ్వనాథం ఆఫీసర్ చాలా మంచివాడు, ఉత్తముడు. విశ్వనాధాన్ని యిబ్బంది పెట్టటం అతనికి యిష్టం లేదు. అందుకే ఆయన అమ్మమ్మ ఫ్రెండ్ మనవడికి ఆ ఉద్యోగం యిచ్చాడు. విశ్వనాధాన్ని తీరిగ్గా యింటి దగ్గిర కూర్చుని రిసెర్చి చేసుకో మన్నాడు.

హీరో అవాల్సిన విశ్వనాధం మళ్ళీ జీరో అయాడు.

తరువాత అన్ని యూనివర్సిటీలలోనూ కనుక్కున్నాడు. తనకీ తన వారికీ అన్నంపెడుతూ రిసెర్చి చేసుకునే మార్గం చూపెడుతారేమోనని, కొంతమంది ప్రొఫెసర్లు యితనిది వాళ్ళ వూరు కాదనీ, కొంతమంది యితనిది వాళ్ళ కులం కాదనీ, కొంతమంది యింతకు ముందే ఆ సీటు వాళ్ళ బావమరిదికి బుక్కయిపోయిందనీ, యింకా కొంతమంది ఇతని గురించి ఏ మినిస్టరూ చెప్పలేదని - మొత్తానికి అతనికి మొండి చెయ్యి కనపడింది ప్రతీచోటా...

నిరుత్సాహపడిపోయాడు. అయినా రోజూ మనసులో అనుకుంటున్నాడు.. తన రిసెర్చి సరిగ్గా సాగితే సైన్సుకే గాక దేశానికే ఎంత ఉపయోగమో..దేశ ప్రతిష్ట విజ్ఞాన ప్రపంచంలో ఎంత పెరుగుతొందో ..... యిలా...

అతని స్నేహితుడు మురళి మాత్రం పెద్దగా నవ్వేవాడు. "నీకు పిచ్చి పట్టింది బ్రదర్..నీ పిచ్చి పిచ్చి ఆలోచనలతో దేశాన్ని, దేశ ప్రగతిని ముడిపెట్టకు. మనం పుట్టింది దేశాన్ని ఉద్ధరించటానికి కాదు.. మనం బాగుపడటానికి. ఎంతమంది కాళ్ళుపట్టు కోవాలో అన్నీ పట్టుకో. ఎంత అవసరమో అంతకన్నా ఎక్కువ సంపాదించు సుఖపడు' అతను గుమాస్తాగానే ఒక అర లకారం సంపాదించాడని అంటారు మరి...

కానీ అతని యింటి ప్రక్క ఆయన మాత్రం విశ్వనాధాన్ని బాగా అభిమానించేవాడు. "నీ ప్రయత్నాలు నువ్వు చేయి బాబూ...మన వాళ్ళు ప్రక్కవాడు గొప్పవాడవుతాడేమోననే అసూయతో అతని అభివృద్ధికి అడ్డువచ్చే బాపతు..విజ్ఞానం ఎక్కడయినా వికసిస్తుంది. ఆనాడు రామానుజం ఎలాటి స్థితిలో వున్నాడు. ఈ దేశంలో ఆయనకు ఏమాత్రం విలువ

లభించలేదు. విదేశీయులు ఆయన్ని తీసుకెళ్ళిపోయి ఆయనలోని విజ్ఞానాన్ని వెలికితీసి, దేశానికి చాటారు. ప్రపంచ విజ్ఞాన శాస్త్ర చరిత్రలోనే ఆయన ఒక నూతన అధ్యాయం ప్రారంభించారు. అప్పుడు మనవాళ్లు 'మా నాయనే' అంటూ దగ్గరకు వచ్చారు. అంతేకాదు మొన్ననే విన్నాం కదా.. హరగోబింద ఖురానా ఎవరు? అమెరికాలో స్థిరపడ్డ భారతీయుడు. పి.హెచ్.డి. చేసిన తర్వాత ఉద్యోగం దొరకక దయనీయమైన స్థితిలో విదేశాలకుచేరి తన విజ్ఞానాన్ని చాటిచెప్పి నోబుల్ బహుమతి పొందాడు. ఇప్పుడు మనవాళ్ళకి ఆయన 'మా భారతీయుడే!' అని చెప్పుకోటానికి సిగ్గెలా లేదో అర్థం కావటం లేదు. నర్లికర్ విషయంలో కూడా..."

విశ్వనాథం బాధగా అన్నాడు - "అవన్నీ తెలుసు బాబాయిగారూ! మన దేశం గొప్ప గొప్ప శాస్త్రజ్ఞులను, విజ్ఞాన వేత్తలనూ దూరం చేసుకున్నది, చేసుకుంటున్నది"..

కాసేపాగి మళ్ళీ అన్నాడు - "నాకే ఆశలూ లేవు.. నన్నూ నా వారిని పోషించటానికి అయ్యే మొత్తం నెల నెలా ఎవరిచ్చినా సరే నేను నా జీవితాన్ని విజ్ఞాన సముపార్జనకే అంకితం చేస్తాను. నాలో కదలాడే ఆలోచనలకు ఒక రూపం యిచ్చి సైన్సుకే కొత్త అందాలను తెస్తాను. అంతేకాదు - కొన్నాళ్ళలో నాలో మీరొక ఖొరానాను, ఒక రామానుజంని, ఒక [illegible]నీ చూస్తారు...నా విజ్ఞాన సంపత్తిని ఉపయోగించి దేశానికి గొప్ప పేరు తెస్తాను. నేనీ మాటలు గర్వంగానే అంటున్నాను. ఆత్మస్తుతి మంచిది కాకపోయినా, నాలో వున్న విశ్వాసం, విజ్ఞానం మేధ నన్నీ మాటలు అనిపిస్తున్నాయి బాబాయిగారు...!

ఆయన విశ్వనాథం కళ్ళల్లోకి చూశాడు. అంత బాధలోనూ గర్వంగా మెరుస్తున్నాయి అతని కళ్ళు. విశ్వనాథం భుజం తట్టాడు ఆయన.

"నిజం బాబూ.. నిజం. మా ప్రక్కనే వున్న నిన్ను మేమీనాడు విస్మరిస్తున్నాం. కానీ నీలో వున్న గొప్పతనం ఏనాడో ఒకనాడు బయటకు రాక మానదు. విశ్వమానవ ప్రగతికే మార్గదర్శకం కాకమానదు.. కాని...కాని..." ఆయన యిక ఏమీ అనలేక యింట్లోకి వెళ్ళిపోయాడు.

ఆరోజు రాత్రి నిద్రలో అనుకున్నాడు విశ్వనాథం..

కానీ...కానీ.. యిక్కడి పరిస్థితులు వేరు.. తన మేధ, విజ్ఞానం యిక్కడ ఎవరికీ అక్కర్లేదు. ప్రభుత్వానికి తనలాటి వారిని ప్రోత్సహించాలనే వున్నా ప్రభుత్వోద్యోగులు ఒప్పుకోరు.

కాకా పట్టే వాళ్ళకి బాకా ఊదే రోజులివి..

జేబులు కొట్టేవాళ్లు డాబుగా బ్రతికే సంఘమిది -

వేలిముద్రగాళ్ళు వేలు సంపాదించే కాలిమిది -

నిద్రలో కూడా చాలా బాధవేసింది విశ్వనాథానికి.

తనేమయిపోవాలి?

గాభరాపడి పెద్దగా అరిచాడు విశ్వనాథం.

అతని భార్య ఉలిక్కిపడి లేచింది. అతన్ని లేపి ఒక గ్లాసుడు మంచినీళ్ళిచ్చింది..

కాలెండరు ఆ రోజు యిరవయి అయిదో తారీకని చెబుతున్నది.

విశ్వనాథం గడ్డం తను పెరిగానని చెబుతున్నది.

కడుపుతో వున్న అతని భార్య నొప్పులురావచ్చని చెబుతున్నది.

అలమరలో వున్న ఖాళీ డబ్బాలు యింట్లో సరుకులు అయిపోయానని చెబుతున్నాయి.

అరిగిపోయిన చెప్పులు అతని జీవితం ఎంత అరిగిపోయిందో చెబుతున్నాయి.

భార్య మెడలోని మంగళసూత్రం మార్వాడీ దగ్గరకు వెడతానని మారాం చేస్తున్నది.

మరి విశ్వనాథం సామాన్య మానవుడు. సగటు భారతీయుడు.

అందుకే మార్వాడీ యిచ్చిన డబ్బుతో సరుకులు కొంటున్నాడు.

ఆ కొట్టతను.. తూనికరాళ్లు ఒక పక్క, రాళ్ళు కలిపిన బియ్యం ఒక పక్కా త్రాసులో వేసి తూస్తున్నాడు.

విశ్వనాథం ఎమ్మెస్సీ కళ్ళు కెమికల్ ఎనాలిసిస్ చేసి కూడా బియ్యంలో రాళ్ళని కనుక్కోలేకపోతున్నాయి.

కల్తీలో మరి ఎక్కడా వెల్తి వుండకూడదు కాబోలు...

సరుకులు తీసుకుని యింటికి వస్తున్నాడు విశ్వనాథం.

అప్పుడే ఎదరయ్యాడు ఆ అపరిచిత వ్యక్తి "మిస్టర్ విశ్వనాథం" పిలిచాడు.

ఆశ్చర్యపోయి తలెత్తాడు విశ్వనాథం.

"మీ విజ్ఞానాన్ని వెలికితీసి, క్రొత్త క్రొత్త ప్రయోగాలు చేసి సైన్సులోనే ఒక అద్భుతాన్ని సాధించాలని అనుకుంటున్నారా?" సూటిగా అడిగాడతను.

విశ్వనాథం ఆశ్చర్యంలో నుంచి పూర్తిగా తేరుకోకుండానే అవునన్నట్టు తలూపాడు.

"మీరు, మీ భార్య, మీ సంసారం, జీవితంలో దేనికీ బాధపడక హాయిగా, సుఖంగా, బోలెడు డబ్బుతో ఆనందాల్ని అనుభవిద్దామనుకుంటున్నారా', అడిగాడు మళ్ళీ.

"అవును.. అహ లేదు.. మాకు మామూలుగా డబ్బుకి ఏ యిబ్బంది లేకుండా జరిగిపోతే చాలు.. డబ్బు కాపీనం నాకు లేదు. అయినా మీరెవరు? ఎందుకు నామీద యింత ఆప్యాయత చూపిస్తున్నారు?" ఆశ్చర్యంలో నుంచి తేరుకుని అడిగాడు విశ్వనాథం.

అతను విశ్వనాథాన్ని కొంచెం దూరంగా ఎవరూ లేని చోటుకి తీసుకువెళ్ళాడు.

"చెబుతాను.వినండి." పూర్తిగా క్షుణ్ణంగా యితనికి అర్థమయేలా చెప్పాడు.

విశ్వనాథానికి బుర్ర తిరిగినట్టయింది. శరీరంలో రక్తప్రసరణం ఆగిపోయిందా అనుకున్నాడు. దేశ ప్రగతికి విజ్ఞానం ఎంతగా దోహదపడుతుందో తెలుసుగానీ, అదే విజ్ఞానం దేశ వినాశనానికి కూడా ఎలా ఉపయోగపడుతుందో ఏనాడూ ఊహించలేదు. దేశ విద్రోహశక్తులు.. ఏ విదేశీ సహాయంతోనూ అజ్ఞాతంగా, అమానుషంగా దేశంలో మారణహోమం చేస్తూ మానవత్వాన్ని ఎలా వదిలేస్తున్నాయో అర్థమయింది. కళ్ళల్లోకి రక్తం వచ్చింది. బాధగా కళ్ళు మూసుకున్నాడు...

కొట్లో బియ్యం తూచిన త్రాసు కనపడింది. ఒక ప్రక్క తూనిక రాళ్ళూ, ఒక ప్రక్క రాళ్ళు కలిపిన బియ్యం. తన జీవితం కూడా ఆ క్షణంలో ఆ త్రాసు లాగానే కనపడింది విశ్వనాథానికి...మరి...??